ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 | సంచిక : 7 | మార్చి 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
25-11-2015
జిన్నూరు
11-01-2016
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-11-2015, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కనుమూసి చూతువు, కనుతెరచి చూపెదవు, చాటుమాటులు లేని చల్లని రమణ అంటే కళ్ళు మూస్తే నిన్ను నువ్వు చూసుకొంటావు, కళ్ళు తెరిస్తే మనందరిలోపల ఏముందో అది మాకు చూపిస్తావు. నువ్వు ఇదికాదు అని. అంటే ఈ శరీరం నువ్వు కాదు, ఈ మనస్సు నువ్వుకాదు. యు ఆర్ నాట్ దిస్, యు ఆర్ దట్ అంటే లోపల ఉన్న సత్యవస్తువే నువ్వు. నీలోపల ఏమి ఉందో మా లోపల అదే ఉంది కాని నీ లోపల ఉన్నది నీకు అర్థమవుతోంది, మా లోపల ఉన్నది మాకు తెలియటంలేదు. అంతే తేడా ఉండటం, లేకపోవటం కాదు. సత్యవస్తువు అందరిలోను ఉంది. అది తెలుసుకొంటే సుఖం, తెలియకపోతే దుఃఖం. గిరీష్ ఇంటి దగ్గర బాగా తాగేసి ఉన్నాడు, అప్పుడు రామకృష్ణుడు ఒకసారి వెళతాడు, గిరీష్ రామకృష్ణుడిని బాగా తిడతాడు. మరుసటిరోజు రామకృష్ణుడు గిరీష్ దగ్గరకు వెళతాడు. అప్పుడు గిరీష్ ఏమన్నాడు అంటే నిన్ను నేను తిట్టిన తిట్లు అన్నీ నువ్వు పడ్డావు, మరల ఈ రోజు మా ఇంటికి వచ్చావు ఏమిటి? అంటే నువ్వు ఏ పరిస్థితిలో ఉన్నావో చూడటానికి వచ్చాను అంటాడు రామకృష్ణుడు. నిన్న తిట్టినప్పుడు తిడుతున్నాను అని నాకు తెలియలేదు. ఇవాళ జ్ఞాపకం వచ్చింది అందుకు నేను దుఃఖపడుతున్నాను. దుఃఖపడినా నాకు ఒకటి తెలిసింది. నిన్నటి వరకు నువ్వూ మాలాంటి వాడివే అనుకున్నాను. నిన్న నేను నోటికి వచ్చినట్లు తిడితే ఎలా ఉన్నావు అని మరల ఈ రోజు నన్ను చూడటానికి వచ్చావు. సామాన్య మానవులు అలా చేయలేరు, అందరూ వైరం పెట్టుకొంటారు. నిన్నటివరకు నువ్వు అర్థంకాలేదు రామకృష్ణదేవా నౌ ఐ అండర్‌స్టాండ్ యు. ఈ రోజున అర్థమవుతున్నావు. యు ఆర్ దట్, రియల్లీ యు ఆర్ దట్. అంటే నువ్వు ఈ శరీరం కాదని, నువ్వు మాలో ఒకడివి కాదని, హృదయంలో ఉన్న బ్రహ్మపదార్థమే ఇలా రూపం ధరించి వచ్చిందన్న సంగతి ఇప్పుడు నాకు

అర్థమవుతోంది అని చెప్పాడు. రామకృష్ణుడి కూడా ఒకడు వచ్చాడు. ఇలా తాగి తిట్టినవాడిని మీరు ఇంత ప్రేమిస్తున్నారు ఏమిటి అని కూడా వచ్చినవాడు రామకృష్ణుడిని అడిగాడు. కొంతమంది స్నేహాలను బట్టి ఈ తాగుడు నేర్చుకుంటారు. కొంతమందికి పుట్టుకతోటే ఈ వాంఛ వస్తుంది. స్నేహాలను బట్టి వచ్చింది తొందరగా పోగొట్టవచ్చును కాని పుట్టుకతో వచ్చిన అలవాటును తొందరగా మార్చటం కష్టం. టైము పడుతుంది కాని వాడు కూడా గుణవంతుడు అవుతాడు. వాడు నిన్న తిట్టినా, ఈ రోజు పొగిడినా నాకు అక్కరలేదు. వాడిని బుద్ధిమంతుడుని చెయ్యాలి. మాకు పనులు ఏమున్నాయి ఈ లోకంలో, అందరినీ గుణవంతులను చేయటమే మా పని. నువ్వు గుణవంతుడవు కాదు, నువ్వు గుణవంతుడవు కాదు అంటే మేము బాగు చేయటానికి ఎవరు మిగులుతారు. రోడ్డు మీద ఉన్న దుమ్ము ఒకోసారి మన బట్టల మీద ఎలా పడుతుందో అలాగ అక్కరలేని గొడవలు, ఉపయోగంలేని గొడవలు ఇవన్నీ మనస్సులో పోగుచేసుకొంటాము. అవి మనకు ఉపయోగమా అంటే ఉపయోగం లేదు. అప్పుడు మన బుద్ధిని ఉపయోగించి అవసరంలేని గొడవలను బయటకు తోలేయాలి. బుద్ధి యొక్క ప్రయోజనం అది. కర్తలేని కర్మను చేసేవాడు బుద్ధిమంతుడు, కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూసేవాడు బుద్ధిమంతుడు అని గీతలో పరమాత్మ చెప్పాడు.

ఇక్కడికి వస్తూ ఉంటే నన్ను ఒకరు ప్రశ్న అడిగారు. ఏమండీ విష్ణువును అనేకమంది భగవంతుడిగా ఆరాధిస్తున్నారు. ఆయనకు గర్వం ఏమిటి? ఆయనకు అహంకారం రావటం ఏమిటి? మొదలు చూడటానికి వాడు లోపలకు వెళ్ళిపోవటం ఏమిటి? బ్రహ్మదేవుడు పైకి వెళ్ళిపోవటం ఏమిటి? వారికి మొదలు, చివర కనబడకపోవటం ఏమిటి? ఈ అరుణాచలం కథ గొడవ ఏమిటి అని అడుగుతున్నారు. శివపురాణంలో, స్కాందపురాణంలో అరుణాచలం గురించి ఉంది. శివుడు సుప్రీమ్ అని చెప్పినవాడు వ్యాసుడు, విష్ణువు సుప్రీమ్ అని చెప్పిన వాడు వ్యాసుడే. శివపురాణంలో శివుడు సుప్రీమ్ అంటున్నాడు, విష్ణుపురాణంలో విష్ణువు సుప్రీమ్ అంటున్నాడు. రెండూ వ్రాసినవాడు ఒక్కడే. పోనీ ఇద్దరు వ్రాస్తే ఏదో వ్రాసారు అనుకోవచ్చు. ఒక్కడే వ్రాసినప్పుడు అలా ఎందుకు అన్నాడు? అది మన కోసమే, భక్తుల కోసమే అలా వ్రాసాడు. బ్రహ్మపదార్థానికి రెండు ముఖాలు. ఒక ముఖం విష్ణువు, రెండవ ముఖం శివుడు. అంటే మీరు శివుడిని ఆరాధించినా, విష్ణువును ఆరాధించినా ఇందులో ఏదో ఒక ముఖం ద్వారా వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవ్వాలి. అంటే గోల్ ఒక్కటే, రూపాలు తేడా అంతే. అరుణాచలం శివక్షేత్రం. శివక్షేత్రంలో శివుడిని సుప్రీమ్‌గా చూపించాలి. అంటే శివుడిని ఆరాధించే వారికి శివుడు సుప్రీమ్ అనే భావన లేకపోతే ఆయన మీద మనస్సు నిలబడదు. అలాగే విష్ణువును ఆరాధించే వారికి విష్ణువే సుప్రీమ్, మనలో అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడే అనే భావన లేకపోతే వారు విష్ణువును ఆరాధించరు. అంటే ఇదంతా ఉపాసనకు, సాధనకు సంబంధించిన విషయాలు.

భగవంతుడికి రూపంలేదు, పేరు లేదు. మనకి ఒక రూపం ఉంది, పేరు ఉంది.

మనకు ఈ రూపంతోటి, పేరుతోటి తాదాత్మ్యం ఉన్నంతకాలం మనకు దేహబుద్ధి పోవటంకోసం ఏదో ఒక దేవతారూపాన్ని మనం ఆరాధిస్తూ ఉంటే మనస్సు అంతర్ముఖమవుతుంది. జీవితం అంటే ఏదో చదువు, ధనం, ఐశ్వర్యం, ఎక్కువ తక్కువలు ఇవన్నీ కాదు. ఇదంతా స్వప్న సమానం. జీవితంలో మనిషి ప్యూరిఫై అవ్వాలి. ప్రతీవాడి మనస్సు స్వచ్ఛం అవ్వాలి. అలాకాకుండా మనస్సు నిండా మురికి ఉన్నప్పడు వాడి మనస్సు అంతర్ముఖం అవ్వదు. అంతర్ముఖం అంటే మనం అనుకొన్నంత తేలికకాదు. మనస్సు అంతర్ముఖం అయితేకాని మనో నాశనం అవ్వదు. మనోనాశనం అయితేగాని అంతర్యామిగా ఉన్న నారాయణుడు సాక్షాత్కారం కాడు. అంటే మనం పునర్జన్మలేనిస్థితిని పొందలేము. మనిషిని రూపం ఆకర్షిస్తుంది. రూపానికి ఆకర్షించే గుణం ఉంది. ఉన్నది ఒక్కటే అని మన ఋషులకు తెలుసు. అయితే విష్ణువు అని, శివుడు అని, అమ్మవారు అని ఇలా చాలా రూపాలు మన హిందూమతంలో పెట్టారు. అంటే విష్ణువు ఎక్కువ, శివుడు తక్కువ లేకపోతే అమ్మవారు ఎక్కువ అనికాదు. ఉన్నది ఒక్కటే. అదే ఇన్ని రూపాలలో కనిపిస్తోంది. మనకు రూపబుద్ధి ఉంది కాబట్టి ఆ రూప బుద్ధిని పోగొట్టుకోవటానికి మన మనస్సును ఏదో రూపం మీద కేంద్రీకరించాలి. ఆచార్యులవారి తల్లి రోజూ పూర్ణానదిలో స్నానం చేసి కృష్ణుడిని ఆరాధించేది. తల్లికి ప్రాణం పోయేటప్పడు ఆచార్యులవారు ఆవిడకు శివరూపం చూపించారు. నా జీవితం పొడగునా విష్ణువుని ఆరాధించాను, ఇప్పడు నువ్వు శివరూపం చూపిస్తున్నావు. నేను జీవితం పొడుగునా ఏ రూపాన్ని అయితే ఆరాధిస్తున్నానో ఆ రూపాన్ని నేను ప్రేమించగలను కాని ఇంకో రూపాన్ని ప్రేమించలేను అని తల్లి చెప్పింది. అప్పడు ఆచార్యులవారు శివరూపం ఉపసంహరించి తల్లికి విష్ణురూపం చూపించాడు. ఆవిడ జీవితం పొడుగునా విష్ణువునే ఆరాధించింది కాబట్టి అక్కడ ఆవిడ మనస్సు నిలబడింది. ఆవిడ మనస్సుకు ఏకాగ్రత వచ్చాక అప్పడు ఆవిడ ప్రాణం విడిచిపెట్టింది. ఆ రకంగా ఆవిడ వైకుంఠం చేరుకొంది.

నువ్వు అద్వైతివి, అజాతవాదివి. ఈ అక్షరమణమాల ఏమిటి? ఉన్నది ఒక్కటే కదా! ఈ పెళ్లికొడుకు ఎవరు? పెళ్లికూతురు ఎవరు? అంటే అది నాకోసం రాసిందికాదు, ఇతరుల కోసం రాసింది అన్నారు భగవాన్. అక్షరమణమాల చదివేవారికి ఈశ్వరుడి మీద భక్తి కలుగుతుంది. అసలు సాంప్రదాయంలో ఈ కర్మమార్గం కంటే, జ్ఞానమార్గం కంటే భక్తి మార్గంలో భగవంతుడిని పొందటం తేలిక. అంతా భక్తే కదా! నువ్వు పనిచేసేటప్పడు అక్కడ భక్తి ఉండాలి. నువ్వు జ్ఞానం గురించి చెప్పేటప్పడు అక్కడ భక్తి ఉండాలి. రమణమహర్షిగారి పేరు చెపితే జ్ఞానమే అని అనుకొంటారు. భగవాన్ ఏమన్నారు అంటే భక్తి లేకుండా ఎవరికీ జ్ఞానం రాదు. తల్లి లేకుండా బిడ్డ ఈ భూమి మీదకు రాదు అలాగే ఎంతోకొంత భక్తి లేకుండా నీకు జ్ఞానం వచ్చే అవకాశం లేదు అని చెప్పారు. వైష్ణవులు ఏమంటారు అంటే మీకు భక్తి ఉన్నమాట నిజమే. అది మిశ్రమ భక్తి. మీరందరూ భక్తిలో జ్ఞానాన్ని కలుపుతారు. జ్ఞానం లేకపోతే భక్తి స్వతంత్రంగా

ఉండలేదా? మాది శుద్ధభక్తి, ప్యూర్‌లవ్, భగవంతుడు చెప్పిన మాటలలో జీవిస్తాము అంటారు. అయితే మేము భక్తులం కాదా అని మీరు అడుగవచ్చు. మీకు ఎంతోకొంత భక్తి ఉన్నమాట నిజం కాని ఆ భక్తిని తీసుకొని వెళ్ళి జ్ఞానంతో కలుపుతారు. మేము అలా జ్ఞానంతో కలపం. భక్తి కూడా ఒక ఇండిపెండెంట్ మార్గమే, మాది శరణాగతిమార్గం అంటారు వైష్ణవులు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించేవాళ్ళందరికీ ఎక్కువ సహనం ఉండాలి, శాస్త్రంపట్ల శ్రద్ధ ఉండాలి. మీరు ఎంత మంచి పనిచేస్తున్నప్పటికీ కొంతమంది బెడ్డలు విసురుతూ ఉంటారు, అది లోకం యొక్క స్వభావం. కుక్క తోక వంకర ఎలా తీయలేమో అలాగే లోకం యొక్క స్వభావాన్ని మనం మార్చలేము. లోకానికి మీరు ఏదైనా చేసినా అది కూడా బ్రహ్మమే అనే భావనతో చేయండి. లోకాన్ని భగవంతుడి స్వరూపంగానే ఆరాధించండి. ఈ ప్రకృతి నా స్వరూపమే అన్నాడు పరమాత్మ. అందుచేత మీరు ప్రకృతిని ఆరాధించినా ఇది కూడా భగవంతుడిదే అనే భావంతో మీరు ఆరాధించాలి.

ఆచార్యులవారు బ్రహ్మసత్యం, జగత్తు మిథ్య అని చెప్పి మరల జగత్తు కూడా బ్రహ్మంగా నిజం అని చెప్పారు. ఇది అందరూ వదిలేస్తున్నారు. బ్రహ్మసత్యం, జగత్తు మిథ్య అని చెప్పి మరల జగత్తు కూడా నిజమే అంటే నామరూపాలుగా నిజంకాదు, బ్రహ్మంగా నిజం అని చెప్పారు. అది బ్రహ్మంగా నిజమయినప్పుడు లోకాన్ని అసలు అబద్ధం అని ఆచార్యులవారు ఎందుకు అన్నారు. అంటే ఈ ప్రపంచం అసత్యం అనే తలంపు నీకు లేనప్పుడు నువ్వు ఎంత సాధన చేసినా నీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఈ ప్రపంచం నిజంకాదు, ఇది అసత్యమే అని గాఢమైన భావన నీకు ఉన్నప్పుడు మాత్రమే నీ మనస్సు అంతర్ముఖమవుతుంది. అంటే ఈ జీవుడు ఆత్మభావన పొందాక, ఈ జీవుడు దేవుడు అయ్యాక అప్పుడు ఈ సృష్టి కూడా దేవుడిగానే నీకు కనిపిస్తుంది. అప్పుడు జగత్తుకు సేవ చేసేటప్పుడు ఎవరో ఇతరులకు చేస్తున్నాము అనే భావన నీకు ఉండదు. పనిచేసేటప్పుడు నీ కుడిచెయ్యి చేసే పని ఎడమ చెయ్యికి తెలియకూడదు అంటాడు ఏసు. నువ్వు చేసినట్లుగా అందరూ గుర్తించాలి అనుకొంటే దాని వలన నీకు అణా పుణ్యం వస్తే దానితోపాటు నీకు 15 అణాల దోషం కూడా వస్తుంది. గుర్తింపుల వల్లనే మనిషి పాడైపోతున్నాడు. గుర్తింపులు అక్కరలేదు. ది మోర్ యు గివ్, ది మోర్ యు రిసీవ్. అది దైవాజ్ఞ, అది భగవంతుడి యొక్క రాజ్యాంగం.

హెచ్చు తగ్గులు లేకుండా నీ దృష్టి సమానమైనది అయితే అప్పుడు మనిషి ఆనందంగా ఉంటాడు. సమానదృష్టి కలిగి ఉండటం యోగం. సమాన దృష్టి ఉన్నవాడు యోగి అవుతాడు. వాడికి ఉండే ఆనందస్థితి నేచురల్‌గా ఉంటుంది, నార్మల్‌గా ఉంటుంది. సంతోషం అనేది కృత్రిమం. బాహ్యవిషయాల మీద ఆధారపడి మనకు సంతోషం వస్తుంది. మీ భర్త బుద్ధిమంతుడు అనుకోండి, మా ఆయన చాలా మంచివారండి అంటారు, అప్పుడు మీకు సంతోషం వస్తుంది. మీకు ఎక్కువ పొలం ఉంది అనుకోండి, ధనం ఉంది అనుకోండి అందులో

నుండి మీకు సంతోషం వస్తుంది. అంటే ఈ సంతోషం అంతా వస్తువుల మీద, ప్రపంచ విషయాల మీద ఆధారపడి ఉంది. ఇలా ప్రపంచ విషయాలమీద నీ సుఖం, సంతోషం ఎంతకాలం అయితే ఆధారపడి ఉన్నాయో అంతకాలం కూడా నీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. విషయస్మరణ వేరు, దైవస్మరణ వేరు. దైవస్మరణ వలన నీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. విషయస్మరణ వలన మనస్సు బహిర్ముఖం అవుతుంది. మనస్సు అంతర్ముఖం అయితే అది జ్ఞానానికి దారితీస్తుంది. మనస్సు బాహ్యముఖానికి వెళితే అది అజ్ఞానానికి దారితీస్తుంది, భవిష్యత్తులో మనం ఎన్నో శవాలను మోయవలసి వస్తుంది. ఇప్పుడు మీరు చాలా సంతోషంగా ఉన్నారు, మంచిదే. కాని మీ సంతోషం అంతా ఏదోరోజున దుఃఖంగా మారిపోవును అంటాడు యేసు. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే నీ గమ్యం ఎక్కడో దూరాన లేదు, నీ హృదయంలోనే ఉంది. నీవు దేనినైతే పొందాలి అనుకొంటున్నావో అది ఎక్కడో లేదు, నీ హృదయంలోనే ఉంది. అయితే దురదృష్టం ఏమిటి అంటే అందరూ గజఈతగాళ్ళే కాని ఈదమంటే ఎవరూ గజం కూడా కదలటంలేదు. అందరూ బాగా సాధన చేసేవాళ్ళే కాని ఎవడూ ఒక్క అంగుళం కూడా లోపలకు దిగటంలేదు. మీరందరు నదులలో స్నానాలు చేస్తున్నారు, పుణ్యకార్యాలు చేస్తున్నారు. మీరు చేసే తపస్సులు, పుణ్యకార్యాలు, మీ స్నానాలు నిజమైతే మీ మనస్సు హృదయంవైపుకు ఒక్క అంగుళం అయినా లోపలకు వెళ్ళాలి కదా? అలా లోపలకు పంపగలిగిన మనిషి కనబడడే అంటున్నారు భగవాన్.

ఫిజికల్‌హార్ట్ వేరు, స్పిరిట్యువల్‌హార్ట్ వేరు. ఫిజికల్‌హార్ట్ మనకు ఎడమవైపున ఉంటుంది. మనం పూర్వజన్మలలో చేసిన పుణ్యాలు, పాపాలు ఇవి అన్నీ వాసన రూపంలో మన కుడివైపున ఉన్న ఆధ్యాత్మిక హృదయంలో ఉంటాయి. అరుణాచలం పుణ్యక్షేత్రం. మాకు ఇంటి దగ్గరే బాగుంది, ఇక్కడకు వస్తే ఉన్న శాంతి పోతోంది అని కొంతమంది భక్తులు అంటారు. దీనికో రహస్యం ఉంది. వాసనలు అన్నీ స్పిరిట్యువల్ హార్ట్‌లో బీజరూపంలో ఉంటాయి. అవి తలంపు రూపంలో వస్తేకాని అసలు ఆ వాసన నీకు ఉందని నీకు కూడా తెలియదు. అరుణాచలం వెళితే కొంతమందికి అశాంతిరావటానికి కారణం ఏమిటి అంటే అరుణాచలేశ్వరుడు నీ హృదయాన్ని కెలుకుతాడు. అది జ్ఞానగిరి. అరుణాచలంలో అరుణాచలేశ్వరుని గుడి, రమణాశ్రమం ఇవి అన్నీ సెకండరీ. మనం గిరికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. ఈశ్వరుడు మీ హృదయంలో ఉన్న వాసనలను కెలికినప్పుడు అవి తలంపు రూపంలో మీ బ్రెయిన్‌లోనికి వస్తాయి. వాడు ఎందుకు కెలుకుతాడు అంటే మిమ్మల్ని బాధపెట్టటానికి కాదు. అసలు ఆ వాసన ఉందని మీకు తెలియటానికే అలా చేస్తాడు. నీకు రోగం ఉందని తెలిస్తే దానిని పోగొట్టుకోవటానికి మందులు వాడతావు లేకపోతే సర్జరీ చేయించుకొంటావు, అసలు రోగం ఉందని ముందు నీకు తెలియాలి కదా! కొంతమందికి అశాంతి రావటానికి కారణం ఏమిటి అంటే అరుణాచలేశ్వరుడు నీ హృదయాన్ని కెలికినప్పుడు లోపల ఉన్న వాసన నీ బ్రెయిన్‌లోనికి వస్తుంది. అప్పడు ఆ వాసన ఉందని నీకు తెలిసినప్పడు నీకు పెయిన్

కలుగుతుంది. ఏమిటి ఇంటి దగ్గరే బాగుంది, ఇక్కడ అశాంతిగా ఉందని అప్పుడు నీకు అనిపిస్తుంది. అరుణాచలేశ్వరుడు లోపల డిస్టర్బ్ చేసినప్పుడు నీ హృదయంలో ఉన్న బురద అంతా బ్రెయిన్‌లోనికి వస్తుంది. ఓహో ఈ బురద అంతా మనలో ఉంది, దీనిని తొలగించుకోవాలి, దీనిని తొలగించుకొంటే కాని మనం పవిత్రం అయ్యే అవకాశం లేదు అనేటువంటి బుద్ధి నీకు కలుగుతుంది, అప్పుడు ప్రయత్నం ప్రారంభిస్తావు.

మనం కొన్ని విషయాలు మర్చిపోవాలి, మర్చిపోతే ఏమీ లేదు. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని అస్తమాను తలపెట్టుకోకూడదు. మీ అత్తగారికి ముసలితనం వచ్చింది, మంచం పట్టింది, లేచి కూర్చునే శక్తి లేదు అందుచేత మీరు ఆవిడను బాగాచూడాలి అంటే ఆవిడ ఏమైనా తక్కువ అనుకొంటున్నారా, నేను కోటలికానికి వచ్చినప్పుడు ఎన్ని మాటలు అంది అంటారు. అవన్నీ మీరు మర్చిపోవాలి. ఎవ్విరీథింగ్ ఈజ్ యండెడ్, యిఫ్ యు ఫర్‌గెట్. మీరు అస్తమాను వాటిని రాపాడించుకోకూడదు, ఆవిడ ఏదో తెలివితక్కువగా అంది అనుకో, అదే పద్ధతిలో నువ్వు కూడా బిహేవ్‌చేస్తే నువ్వు కూడా తెలివితక్కువ దానివే కదా! అత్తగారు మంచిదా, చెడ్డదా అనేది మీకు అనవసరం. ఆవిడను చూడటం మా డ్యూటీ అని మీరు అనుకోవాలి. తల్లి తరువాత అత్తగారు కూడా తల్లితో సమానం అని శాస్త్రంలో చెప్పాడు. నిన్ను కన్నతల్లి ఎటువంటిదో నీ భర్త తల్లి కూడా నీకు అటువంటిదే. అందుచేత అత్తగారిని తల్లిలా నువ్వు చూడాలి. మరి అప్పుడు అలా అందండి, ఇలా అందండి అంటే అవన్నీ కూడా మర్చిపోవాలి. ఆవిడ బిహేవియర్ మంచిగా ఉండాలి అని నువ్వు అనుకొన్నప్పుడు, అలా మంచిగా నువ్వు ఎందుకు ఉండలేకపోతున్నావు. ఆవిడది పొరపాటు అని చెపుతున్నావు. పోనీ పొరపాటే నువ్వు మంచిగా ఎందుకు ఉండలేకపోతున్నావు. ఆవిడ చెడ్డగా ఉన్నారని నువ్వు ఎందుకు చెడ్డగా ఉండటం, నువ్వు మంచిగా ఉండవచ్చు కదా! కోటరికానికి వచ్చినప్పుడు ఆవిడ ఏదో అందట, ఇప్పుడు ఆ గొడవలు ఎందుకు? ఇప్పుడు ఆవిడ చనిపోవటానికి సిద్ధంగా ఉంది. నీ డ్యూటీ ఏదో చెయ్యి. నువ్వు మంచిగా చూడటానికి ప్రయత్నం చెయ్యి. పాత గొడవలన్నీ మర్చిపోవాలి.

భాగవతంలో ఒకమాట ఉంది. మనిషి పుట్టిన రోజునే వాడు చనిపోయే రోజు కూడా నిర్ణయం అయిపోతుంది. ఆ చనిపోయే రోజు మనకు తెలియదు కాబట్టి మనకు చావు ఎప్పుడో వస్తుంది అని అనుకొంటాము. స్వామీజీతో రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నీ 40వ జన్మదినోత్సవం చూసుకోకుండా చనిపోతావు అని చెప్పాడు. ఎప్పుడో 20 సంవత్సరాల ముందు చెప్పాడు. అది ఊహించి చెప్పింది కాదు, దర్శించి చెప్పింది. అలాగే స్వామీజీ 39 సంవత్సరాల 6 నెలల 4 రోజులకు చనిపోయాడు. నరేన్ నీకు ఇక్కడ సొంత పనులు ఏమీ లేవు, నా పని చేయటానికే వచ్చావు, నీకు భూమి అక్కరలేదు, నీకు ధనం అక్కరలేదు, నీకు భార్య అక్కరలేదు, నా పని చేయటానికే ఇక్కడకు వచ్చావు అంటాడు రామకృష్ణుడు. ఆయన ఏ పని మీద వచ్చాడో ఆ పని పూర్తి అయిపోయింది, తరువాత శరీరం చనిపోయింది. ఏదైతే ఆ శరీరం ద్వారా జరగవలసి

ఉందో అది జరుగుతుంది. ఒకోసారి అది మంచి పని అయినా, నువ్వు చెయ్యాలని అనుకొన్నా చెయ్యలేవు. ఆ పని చేసే యోగం నీకు లేదు. అది ఈశ్వరనిర్ణయం ప్రకారం జరుగుతుంది. నీ గమ్యం ఎక్కడో లేదు, నీ హృదయంలోనే ఉంది. అయితే నీ మనస్సుతోటి, వ్యక్తిభావనతోటి అక్కడికి వెళ్లలేవు. నేను ఫలానా వ్యక్తిని, అయామ్ సో అండ్ సో అనుకొంటేమటుకు నువ్వు హృదయంలోనికి చేరలేవు. నువ్వు ప్రయత్నం చేసినా నీ వాసనలు అక్కడకు చేరనివ్వవు. నువ్వు వ్యక్తిభావనను విడిచిపెట్టకుండా నీ హృదయగుహలోనికి వెళ్లలేవు. దేహబుద్ధి ఉన్నవాడికి ప్రతీవాడికి శరీరం వస్తుంది. శరీరం వచ్చింది అంటే దాని ప్రారబ్ధం ప్రకారం ఆ శరీరం ద్వారా ఏ పని జరగాలి, ఏ పని జరగకూడదు అనేది ఈశ్వరనిర్ణయం ప్రకారం జరుగుతూ ఉంటుంది. అహంకరణ మనం కాదు. కాని అదేమనం అనే తలంపు బలంగా ఉండటం వలన దానిని పోగొట్టుకోవాలనే బుద్ధి మనకు కలగటంలేదు. మనం ఇతరులను చంపగలం కాని మనలను మనం చంపుకోలేము. అహంకరణ నేనే అనే తలంపు బలంగా ఉంది కాబట్టి దానిని పోగొట్టుకొనే ప్రయత్నం మనం చేయటంలేదు, కాని ఎంతో కొంత ప్రయత్నం అవసరం. మేము ప్రయత్నాలు చేయలేము, సాధనలు చేయలేము, అంత ఓపిక మాకు లేదు. నువ్వే అన్నం వండు, నువ్వే అరిటాకు సంపాదించు, నువ్వే వడ్డించు అని రంగన్ భగవాన్‌తో అంటే సరే బియ్యం నేనే సంపాదిస్తాను, అరిటాకు నేనే తెస్తాను, వంట నేనే చేస్తాను అంతేకాదు నీ నోట్లో పెట్టమంటే పెడతాను కాని మింగటం అనే పని నువ్వే చేయాలి, అది ఒక్కటీ చేస్తే చాలు అంటారు భగవాన్. అది వాళ్ల ఎఫెక్షన్, అది ప్యూర్ లవ్, అన్ పొల్యూటెడ్ లవ్.

మీకు ఏమైన కష్టాలు రావచ్చు, నష్టాలు రావచ్చు, లాభాలు రావచ్చు, ఈ బాడీకి సఫరింగ్స్ ఎక్కువగా వస్తూ ఉన్నా అవి ఈశ్వరుడే పంపిస్తున్నాడని మీకు తెలియకపోవటం వలన మీరు కంగారుపడతారు. ఆయన కావాలనే ఆ కష్టాలను పంపుతాడు. ఆయనకు తెలియకుండా మీకు ఏమీ రావటానికి అవకాశంలేదు. మీకు ఏరకమైన బాధ వచ్చినా అది ఈశ్వరుడు పంపితేనే వచ్చింది కాని ఈశ్వరునికి తెలియకుండా మటుకురాదు. ఇది మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి. అయితే మేమంటే భగవంతుడికి ఇష్టంలేదా అంటే మీరు ఇష్టం లేక కాదు, మిమ్మల్ని పవిత్రుడిని చేయటానికే ఇవి అన్నీ పంపిస్తున్నాడు. భగవంతుడికి మీ మీద కోపం ఉందా అంటే, మనలాగే ఇష్టాలు, అయిష్టాలు, కోపాలు ఉంటే ఆయన భగవంతుడు ఎలా అవుతాడు? మిమ్మల్ని పవిత్రులను చేయటానికి స్పిరిట్యువల్‌గా మిమ్మల్ని ఉన్నతస్థితికి చేర్చటానికి కావాలనే ఆయన సఫరింగ్స్ పంపిస్తాడు, దేవుడు చేసింది మంచిదే అని తెలియక దేవుడు ఇలా చేసాడు ఏమిటి అని అనుకొంటాము. దేవుడికి నువ్వంటే ఇష్టం లేదా అంటే ఇష్టం లేకపోతే ఆయన దేవుడు ఎలా అవుతాడు? ఆయనది హ్యూమన్‌లవ్‌కాదు, ఆయనది డివైన్‌లవ్. మనకు హ్యూమన్‌లవ్ అర్థమవుతుంది కాని డివైన్‌లవ్ అర్థంకాదు, మన బ్రెయిన్ అక్కడకు రీచ్ అవ్వలేదు. మానవస్వభావం చాలా విచిత్రమైనది. డబ్బులేని వాడిని బీదవాడు అంటారు, వాడికి డబ్బు వస్తే ద్వేషిస్తారు. ఇది మానవస్వభావం. అందుచేత మనకు మానవులు

ప్రమాణంకాదు. శాస్త్రం ప్రమాణం, ఈశ్వరుడు ప్రమాణం. ఎవరో ఏదో రాసారని అది ప్రమాణం కాదు. అంటే ఒక ఋషి చెప్పినా, ఒక యోగి చెప్పినా అది భగవంతుడు చెప్పిన మాటకు విరుద్ధంగా ఉంటే దానిని తీసి ఒక ప్రక్కన పెట్టేయవచ్చు.

నీకు కళ్ళులేవు, కళ్ళు లేకుండా అంతా చూస్తున్నావు. మాకు ఏదైనా వస్తువును చూడాలంటే కళ్ళు లేకుండా చూడలేము. నీకు కళ్ళు లేవు, కళ్ళు లేకుండా అంతా చూసే నిన్ను చూడగలిగిన వారు ఈ లోకంలో ఎవరైనా ఉన్నారేమో చూడు అని భగవాన్ అరుణాచలేశ్వరుడిని అడుగుతున్నారు. నీకు కళ్ళు లేవు, వీడికి కళ్ళు లేవు ఏమీ కనబడదు అనుకొంటే ప్రమాదం. ఎందుచేతనంటే కళ్ళు లేకుండా అంతా చూస్తాడు. మీరు తలుపులు అన్నీ వెసుకొని ఇంటిలో ఒంటరిగా కూర్చున్నారు అనుకోండి, మనం ఒంటరిగా ఉన్నాము ఇక్కడ ఇంకెవరు లేరు అనుకొంటే ప్రమాదం. అప్పుడు కూడా అక్కడ మీకు గాడ్ ప్రెజెన్స్ ఉంది. ఆయన చూస్తూ ఉంటాడు. మీకు వచ్చే తలంపులు అవి మంచి తలంపులా, చెడు తలంపులా అదీ చూస్తూ ఉంటాడు. భాగవతంలో ఉన్న లీలలు గురించి కొంతమంది ఆక్షేపిస్తారు. అనేకమంది మహాత్ములకు మోక్షం రాకపోవచ్చుకాని గోపికలకు అందరికీ మోక్షం వచ్చింది. ఎందుచేతనంటే కృష్ణుడు పరమాత్మ అనీ, కృష్ణుడు భగవంతుడు అనీ వారికి తెలియదు. మనతో ఆడుకొనే పిల్లవాడు అనుకొన్నారు. వీడు వారితో ఆడుకొన్నాడు. అందులో దేహానికి సంబంధించికాని, లోకానికి సంబంధించి కాని ఏమీ లేదు. అప్పుడు కృష్ణుడు 8 సం॥ల పిల్లవాడు. కృష్ణుడికి వాళ్ళంటే ఇష్టం ఉండేది. వాళ్ళు కూడా కృష్ణుడు అంటే ఇష్టంగా ఉండేవారు. అది అభౌతికం, అది అలౌకికం. అది మెంటల్ ప్లేన్‌లో జరగటంలేదు, ఫిజికల్ ప్లేన్‌లో జరగటంలేదు. ఇక్కడ సీక్రెట్ ఏమిటి అంటే వాడు భగవంతుడు అని వారికి తెలియదు, పరమేశ్వరుడే ఆ రూపంలో వచ్చాడని వారికి తెలియదు. బృందావనంలో వాడితో సరదాగా ఆడుకొనేవారు, ఆయన వారితో అలా ఆడుకొంటూ, ఆడుకొంటున్నట్లు నటిస్తూ వారిలో ఉన్న వాసనలన్నీ తీసేసి, వారిని వాసనారహితులుగా చేసాడు. కృష్ణుడి లీలలు చదువుతూ ఉంటే కామం పెరుగుతుంది కదా అని కొంతమంది అంటారు. దాని వలన కామం పెరగదు సరికదా కామం నశిస్తుంది. మనిషికి కామం ఎలా నశించాలి అని ఒక ప్లానింగ్ చేసి వ్యాసుడు ఆ ఘట్టాన్ని సృష్టించాడు. ఇక్కడ కృష్ణుడు సుప్రీమ్. శివుడు ధ్యానం చేస్తూ ఉంటే అప్పుడు మన్మథుడు శివుడికి కామం కలిగించాడు. అప్పుడు శివుడు కళ్ళు తెరచి మన్మథుడిని కాల్చి చంపాడు. కృష్ణుడికి సహజంగానే కామం లేదు. కృష్ణుడు అమ్మాయిలతో ఆడుకొంటూ, పాడుకొంటూ ఆయన ఎవరో వారికి తెలియదు అన్న సంగతి తెలిసి కూడా వారితో ఇష్టంగా ఉంటూ గోపికలను కామంలేని స్థితికి తీసుకొనిపోయాడు. మనలను ఎవరైనా గుర్తించకపోతే కోపాలు వచ్చేస్తాయి. కృష్ణుడు భగవంతుడు అని వారు గుర్తించటం లేదు అయినా ఆయన కోపరహితుడు, వాడు కృష్ణుడు.

కొన్ని వర్డ్స్ మోర్టల్. ఇవాళ వింటాము రేపు మర్చిపోతాము. కొన్ని వర్డ్స్ అలాకాదు యిమ్మోర్టల్ వర్డ్స్. అంటే మన శరీరాలు పోయినా అవి మన మనస్సులో మెదులుతూ ఉంటాయి. ఈమధ్య ఋషికేష్ స్వామి వచ్చినప్పుడు మా ఆశ్రమానికి మీరు రండి అనలేదు. మన ఆశ్రమానికి వెళ్ళిపోదాము రండి అన్నారు. ఎక్స్‌ప్రెషన్ ఈజ్ వెరీ బ్యూటిఫుల్. అవి యిమ్మోర్టల్ వర్డ్స్. మీరు ఎవరైనా పిలిస్తే మా ఇంటికి వచ్చి చూసి వెళ్ళండి నాన్నగారు అంటారు. ఆయన అలా అనలేదు మన ఆశ్రమానికి వెళ్ళిపోదాము, అక్కడ ఉందాము, మన ఆశ్రమానికి ఆనుకొని గంగానది ప్రవహిస్తోంది అన్నారు. అవి యిమ్మోర్టల్ వర్డ్స్. అంటే కొన్ని మాటలు మన మనస్సును కడిగి వదిలేస్తాయి. పోనీ ఆయనకు నాకు బహుకాలం పరిచయం ఉందా అంటే అంత పరిచయం లేదు. ఆయన పెద్ద స్వామి. ఇతర దేశాలు కూడా వెళ్ళి మాట్లాడుతూ ఉంటారు. ఆయనతో మాట్లాడేటప్పుడు నా హృదయం కంటే ఆయన హృదయం ఎక్కువ విశాలమైనది అని నాకు తెలుస్తోంది. మరి నేను ఆయనను చూడటానికి వెళ్ళాలి కాని ఆయన నన్ను చూడటానికి రావటం అంటే అది ఈశ్వర లీల.

మీ ఇంట్లో ఎవరైనా అసహజంగా మరణించాలి అనుకొంటే మీరు దానిని ఆపు చేయలేరు. ఎందుచేతనంటే వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇంక మనం దీనిని పరిష్కరించలేము, మనకు దారి కనబడటంలేదు, సమాధానం దొరకటంలేదు ఇంక చనిపోవటమే మంచిది అని మీ బుద్ధిలో ఉన్న దోషం అనిపింపచేస్తుంది. వారికి పరిష్కారం కనబడదు, తొందరగా చనిపోదాము అనిపిస్తుంది, వాడు చనిపోవటానికి ప్రయత్నం చేస్తాడు, అప్పుడు వాడికి అసహజ మరణం వస్తుంది. మరి జీవితం పొడుగునా కష్టాలు పడినవారు ఉన్నారు, వారందరూ చనిపోతున్నారా అంటే లేదు. కొంతమంది ధనవంతులు కూడా చనిపోతున్నారు. అంటే వారికి ధనం లేదా అంటే అది కాదు. అది బుద్ధిలో ఉన్న ఒక దోషం. వారు మంచివారా, చెడ్డవారా అని కాదు, శరీరానికి రోగాలు ఎలా వస్తాయో అలాగ అది బుద్ధిలో ఉన్న ఒక రోగం. సమస్య వచ్చినప్పుడు దీనికి పరిష్కారం ఏమిటి అని ఎవరైనా పెద్దవారిని సలహా అడుగుదాము అని వారికి ఉండదు, మన క్షేమం కోరేవారితో మన సఫరింగ్‌ను షేర్ చేసుకొందామని కూడా వారికి అనిపించదు. అటువంటప్పుడు మన క్షేమం కోరేవారి దగ్గర మన హృదయాన్ని ఓపెన్ చెయ్యాలి అని కూడా వారికి తెలియదు. వాళ్ళకు ఇంకో మార్గం కనబడదు. చనిపోవటమే మంచిది అని వాళ్ళకు అనిపిస్తూ ఉంటుంది, అది బుద్ధిలో ఉన్న ఒక రోగం. మన శరీరానికి పక్షవాతం ఎలా వస్తుందో అలాగ అది ఒక జబ్బు.

చాలామంది భయం గురించి ఎక్కువగా మాట్లాడుతూ ఉంటారు. ముసలితనం వచ్చాక తొందరగా భయం వస్తుంది. మీరు ఇంక ఎంతోకాలం జీవించరు, తొందరగా వెళ్ళిపోతారు అని డాక్టరు చెప్పినా భయం వస్తుంది. మీ హృదయంలో ఒక నిజం ఉంది. దానిని తెలుసుకోవటానికి మీ మనస్సే మీకు అడ్డువస్తోందని చెపుతున్నారు. మనస్సు చిరిగిపోవాలి. మనస్సు ఎలా చిరిగిపోతుంది అని అడుగుతున్నావు. నువ్వు ఎవరవు

అనుకొంటున్నావు? మనస్సే నువ్వు అనుకొంటున్నావు కదా! నిన్ను నువ్వు చంపుకొంటావా? దానిని నువ్వు చంపలేవు. అందుచేత దాని సోర్సులోనికి మనస్సును పంపటానికి ప్రయత్నం చెయ్యి. మనస్సు యొక్క సోర్సు నీలోపలే ఉంది. మనస్సు దాని పుట్టుక స్థానాన్ని అది దర్శించిన వెంటనే మనస్సు నశిస్తుంది. ఎక్కడైతే మనస్సు నశించిందో అక్కడ నీకు జ్ఞానోదయం అవుతుంది. మనస్సు పుట్టుకస్థానం అయిన హృదయంలోనికి చేరుకొన్నప్పుడు అక్కడ ఉన్నది నామరూపరహితం, రాగద్వేషరహితం. అప్పుడు మనస్సును బాగుచేసుకోవటానికి, మనస్సును జయించటానికి ఇంక అక్కడ మనస్సే లేదని నీకు తెలుస్తుంది. దానిని నో మైండ్ స్టేట్ అంటారు. నువ్వు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా, ఎన్ని గుడులుచుట్టూ తిరిగినా నువ్వు నో మైండ్ స్టేట్‌కు వెళితేగాని ట్రూత్‌ను రీలైజ్ చేయలేవు. నువ్వు మనో మూలాన్ని వెదికితే అది లేకుండా పోతుంది. అప్పుడు నీకు ఆందోళనలు లేవు, అశాంతిలేదు, భయంలేదు. నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా నీ హృదయంలో ఉన్న నిజాన్ని నువ్వు గ్రహించాలి, అందులో ఐక్యమవ్వాలి. యు మస్ట్ నో ద ట్రూత్ అండ్ ద ట్రూత్ ఓన్లీ షల్ మేక్ యు ఫ్రీ.

భయం వలన దుఃఖం వస్తుంది. అందుచేత మీరు భయాన్ని విడిచిపెట్టండి. అయితే భయం ఎలా పోతుంది, భయం అనేది కూడా ఒక తలంపే. తలంపు వచ్చాక భయం వస్తుంది కాని తలంపు లేకుండా భయం లేదు. నీకు నిద్రలో భయంలేదు. నిద్రలో పాము నీ కాళ్ళమీద నుండి పాకి వెళ్ళినా నీకు భయంలేదు ఎందుచేతనంటే అక్కడ తలంపులు లేవు. పగలు దుఃఖంతో ఏడుస్తున్నావు. అక్కడ నేను అనే తలంపు ఉంది. రాత్రి హాయిగా నిద్రపోతున్నావు. నిద్ర రాకపోతే నిద్ర మందులు మింగుతున్నావు. ఎందుచేతనంటే అక్కడ సుఖంగా ఉంది. నిద్రలో నీకు శరీరం కనబడదు, మనస్సు కనబడదు, దేవుడు కనబడడు, ప్రపంచం కనబడదు. అక్కడ నువ్వు ఉంటావు కాని నేను అనే తలంపు అక్కడ లేదు. అక్కడ సుఖంగా, శాంతిగా ఉంటావు. అందుచేత నీకు నిద్ర వచ్చే టైములో ఎవరైనా పలకరిస్తే రేపు మాట్లాడదాము అంటావు. ఎందుచేతనంటే మీకు నోటికి అందని సుఖం గాఢనిద్రలో ఉంది. అక్కడ నేను అనే తలంపు లేదు అందుచేత నిద్రలో హాయిగా, సుఖంగా ఉన్నారు. మెలకువ వచ్చాక నీకు నేను అనే తలంపు వస్తోంది. అక్కడ నుండి నీకు దుఃఖం, అశాంతి ప్రారంభమవుతాయి. నేను అనే తలంపు ఎక్కడ ఉంటే అక్కడ దుఃఖం ఉంది కాని ఆ తలంపు లేనప్పుడు నీకు దుఃఖం లేదు, భయం లేదు. మీరందరూ ఒకటిగా ఉన్నారా, రెండుగా ఉన్నారా అంటే మీరందరూ ఒకటిగానే ఉన్నారు. ఆ ఒకటి ఏమిటో మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక రెండోది కనబడదు. రెండోది ఎప్పుడైతే మీకు కనబడదో అప్పుడు మీకు భయం కూడా ఉండదు. రెండు ఉంటే భయంకాని, ఉన్నది ఒక్కటే అయితే భయం ఏమిటి? ఇతరులను చూస్తే మీకు భయం వేస్తుంది కాని మిమ్మల్ని చూసి మీకు భయం వేయదు కదా! ప్రహ్లాదుడిని గొప్ప భక్తుడిగా చూస్తారు కాని వాడు అద్వైతి. ఎందుచేతనంటే ఆయన రెండవ దానిని ఎప్పుడూ చూడలేదు. ఎక్కడ చూసినా, ఏది చూసినా అంతా

నారాయణుడే కాని రెండవ వస్తువుని చూడలేదు. ఏనుగులచేత త్రొక్కించినా, పాములచేత కరిపించినా ఆ ఏనుగులోను, పాములోను కూడా నారాయణుడినే చూసాడు. రెండోది ఆయనకు తెలియదు అందుచేత ప్రహ్లాదుడికి భయం రాలేదు. రెండో వస్తువు ఉన్నప్పడే భయం వస్తుంది. నువ్వు రెండవదానిని చూసినప్పడు నీకు భయం వేస్తుంది. నీకు ప్రపంచం విడిగా ఉన్నట్లు, మనుషులందరూ విడిగా ఉన్నట్లు, ప్రకృతి అంతా నీకు విడిగా ఉన్నట్లు, వాళ్ళు వేరు మనం వేరు అనే భావనను అహంకరణే కలిగిస్తుంది, నీ మనస్సే అలా చూస్తుంది. ఈ భిన్నత్వం అంతా కూడా ఈగోసెన్స్‌వల్లే వస్తోంది. నీ ప్రవర్తనలో, నీ మాటలో అహంకరణ ఉండకూడదు. దైనందిన జీవితంలో అహంకరణ ఉండకూడదు. కేవలం మొద్దబ్బాయిలాగ ఏదో తపస్సు చేస్తున్నట్లు కూర్చుంటే నీకు రియలైజేషన్ రాదు. నీ బిహేవియర్ పేట్రన్ ఎలా ఉంది అని భగవంతుడు చూస్తాడు. నువ్వు మాట్లాడే మాటలను, నువ్వు చేసే పనులను భగవంతుడు చూడడు. నువ్వు ఏదో మాట్లాడుతున్నావు, ఏదో పని చేస్తున్నావు అవి ఎందుకు చేస్తున్నావు, వాటి వెనకాల ఉన్న ఉద్దేశం ఏమిటి అని భగవంతుడు చూస్తాడు. అవి మంచికోసం చేసావా, సమాజానికి ఉపకారం చేయటానికి చేసావా లేకపోతే నీ గొప్పతనం ప్రపంచానికి తెలియటానికి చేసావా అని ఇవి అన్నీ భగవంతుడు చూస్తాడు.

ఇప్పడు నీ శరీరాన్ని, మనస్సును నువ్వు ఎలాగైతే ఎక్స్‌పీరియన్స్ చేస్తున్నావో అలాగ నీ హృదయంలో ఉన్న డివినిటీని నువ్వు ఎక్స్‌పీరియన్స్ చేయగలిగితే అప్పడు సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఆనందం వచ్చి నిన్ను ముంచేస్తూ ఉంటుంది. అక్కడ శాంతి ఉంటుంది, సుఖం ఉంటుంది, శక్తి ఉంటుంది. ఆ డివైన్ సోల్స్‌ను నువ్వు ఆరాధిస్తూ ఉంటే నీకు తెలియకుండానే వాళ్ల ప్రభావం వచ్చి నీ బ్రెయిన్‌మీద పనిచేస్తుంది. ఆయన పని చేస్తున్నాడు అని కూడా నీకు తెలియదు. మేము పనిచేస్తున్నాము అని మీరందరూ అనుకొంటున్నారు కదా కాని గాడ్ ఎలోన్ ఈజ్ వర్కింగ్. భగవంతుడు పనిచేయటంకాదు, భగవంతుడు మాత్రమే పని చేస్తున్నాడు. మరి మా మాట ఏమిటి అంటే మీరూ పనులు చేసుకొంటున్నారు కాని ఫలితం భగవంతుడి చేతిలో ఉంటుంది. మీరు చేస్తున్నప్పడు ఒకోసారి సక్సెస్ అవ్వవచ్చు లేకపోతే ఫెయిల్ అవ్వవచ్చు. ఇదంతా భగవంతుడి మీద ఆధారపడి ఉంది. గాడ్ ఈజ్ వర్కింగ్ అని శాస్త్రంలో చెప్పారు. కాని ఇక్కడ భగవాన్ గాడ్ ఎలోన్ ఈజ్ వర్కింగ్ అంటున్నారు.

నేను ఈ ప్రపంచాన్ని ఉద్ధరిస్తున్నాను, ప్రపంచానికి ఉపకారం చేస్తున్నాను అంటారు. ప్రపంచానికి ఉపకారం చేయటానికి నువ్వు ఎవడవు? ప్రపంచం మనకు అనేక విషయాలు నేర్పుతుంది. సమాజాన్ని చూసి మనం అనేక విషయాలు నేర్చుకొన్నాము. మనం కొంచెం పెద్దవాళ్లము అయ్యాము అంటే ఎంతమంది సహకరిస్తే మనం ఇలా అయ్యాము. అంటే మనం ఈ ప్రపంచానికి ఋణపడి ఉన్నాము కాని మనం ఏమనుకొంటున్నాము అంటే ఈ ప్రపంచమే మనకు ఋణపడి ఉంది అనుకొంటాము, అది మన అహంకారానికి గుర్తు. నేను

ఈ ప్రపంచాన్ని ఉద్ధరిస్తున్నాను అంటే అవి అపచారం మాటలు. మీ అమ్మకు అన్నంపెట్టి మా అమ్మను నేనే పోషిస్తున్నాను, అంతా నేనే చూస్తున్నాను అంటే అవి దుర్మార్గం మాటలు. ఈ ప్రపంచానికి మనమే ఋణపడి ఉన్నాము, అది మనం గుర్తుపెట్టుకోవాలి. అంతేగాని నేను ఏదో ఈ ప్రపంచానికి సేవ చేస్తున్నాను అనుకొంటే అది నీలోపల ఉన్న అహంకరణకు గుర్తు.

అసలు మనస్సు ఉంటే రెండోది, మనస్సు లేకపోతే రెండోది లేదు. నువ్వు ఒకడిని చూస్తున్నావు అనుకో నువ్వు చూడబడేవాడు బయటే ఉన్నాడు. ఆ మనిషిని చూసేవాడు నీలోపలే ఉన్నాడు. అది నీకు తెలుస్తోంది కదా! ఎవడైతే నీలోపల ఉండి చూస్తున్నాడో వాడిని నువ్వు తెలుసుకోగలిగితే ఇంక నీకు భయంలేదు, డౌట్స్ లేవు. ఆ చూసేవాడే డౌటర్. వాడు ఎప్పుడైతే పోయాడో వాడితోపాటే సందేహాలన్నీ మనల్ని వదిలిపోతాయి. నీలోపల ఉండి చూసేవాడిని నీవు తెలుసుకొంటే ఇంక నీకు భయాలు ఉండవు, కోపాలు ఉండవు, తాపాలు ఉండవు. నీవు కూల్ అయిపోతావు. నీకు ఎంతశాంతి కావాలో అంతలోపలనుండే నీకు సప్లయి అవుతూ ఉంటుంది. అప్పుడు నువ్వు బయట విషయాల మీద, బయట మనుషుల మీద దేనిమీద ఆధారపడనక్కరలేదు. అప్పుడు మీరు స్వతంత్రులు అవుతారు. ఏ వస్తువు అయితే మీ లోపల స్వతంత్రంగా ఉందో ఆ వస్తువును తెలుసుకొన్నప్పుడు మాత్రమే మీరు స్వతంత్రులు అవ్వగలరు. అప్పటివరకు ఎటుగాలి వేస్తే అటు పోతూ ఉంటారు. సర్వసాధారణంగా స్వంతంగా ఆలోచించేవాళ్ళు లోకంలో తక్కువగా ఉంటారు. ఎందుచేతనంటే మెదడు సోమరితనానికి అలవాటుపడిపోయింది. కొంతమందికి వాళ్ళ ఆలోచనే అమృతం. మనకు ఆలోచన లేదు. ఎవరో ఏదో చేసారని మనం కూడా చేయటంకాని స్వంతంగా ఆలోచించము. మన మెదడు ఆలోచించటానికి ఇష్టపడదు, దానికి సోమరితనం అంటే ఇష్టం.

మీకు భయం ఉంది, అది ఒక తలంపు. మీకు భయం ఒక్కటేకాదు ఇంకా అనేక తలంపులు ఉన్నాయి కదా! ఈ తలంపులన్నింటికి ఏదైతే ఆధారంగా ఉందో, ఆ ఆధారంగా ఉన్నది నశించినప్పుడు తలంపులు కూడా నశిస్తాయి. రోగ కారణం పోయినప్పుడు రోగం కూడా పోతుంది. ఒకవేళ తాత్కాలికంగా నీకు రోగం తగ్గినా లోపల రోగ కారణం కనుక ఉంటే రోగం మరల వస్తూ ఉంటుంది. అలాగే మనస్సు పూర్తిగా నాశనం అయితే నమ్మగలం కాని అణిగిన మనస్సును నమ్మటానికి వీలులేదు. అది ఎప్పుడైనా మరల విజృంభించవచ్చు. అందుచేత నో మైండ్ స్టేట్ రావాలి. మన మనస్సు మనలను చేసే చీటింగ్ చూడండి. ఇవాళ ఏదో ఒక మాట చెపుతాము, మరల రేపు తప్పుతాము. మనం చెప్పిన మాటే మనం పోషించుకోలేము. మన మాట మీద మనకు గౌరవం లేదు. మరి నిన్న అలా అన్నావు, ఇవాళ ఇలా అంటున్నావు ఏమిటి అంటే మరి నిన్న అలా అనిపించింది, ఇవాళ ఇలా అనిపిస్తోంది అంటాడు. దానికి ఎవడు సమాధానం చెపుతాడు. అంటే వాడికి స్థిరత్వం లేదు. నీ లోపల ఉన్న బలహీనతలను, నీలోపల ఉన్న కుళ్ళును నువ్వు పోగొట్టుకొంటే లోపల ఉన్న సద్వస్తువు

నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఇప్పుడు దేహం నీకు ఎంత సహజంగా స్ఫురిస్తుందో అప్పుడు లోపల ఉన్న సత్యవస్తువు అంత స్పష్టంగా నీకు స్ఫురిస్తుంది. సత్యం ఎలా ఉంటుంది అని అడుగుతున్నారు. దీనికి భగవాన్ ఏమంటున్నారు అంటే సత్యం అనేది నువ్వు అనుకొన్నట్లుగా ఉండదు. అది ఎలా ఉండాలో అలా ఉంటుంది. ఎంత బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషనో చూడండి. సబ్జక్టును బాగా ఎంజాయ్ చెయ్యండి. మీకు అనుభవంలోనికి వచ్చిందా లేదా అన్నది తరువాత చూద్దాము. ముందు సబ్జక్టును ఎంజాయ్ చెయ్యండి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-1-2016 , జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మౌనం మహా శక్తివంతమైనది. కొన్ని సంవత్సరాల తరబడి సంభాషించటం వలన తెలియని విషయం మౌనంలో ఒక్క క్షణంలో తెలుస్తుంది. మీ హృదయగుహలో మనస్సు అణిగిపోయినప్పుడు, అంటే నో మైండ్ స్టేట్ పొందినప్పుడు మీ మౌనానికి శక్తి ఉంటుంది కాని మామూలుగా నోరు మూసుకొని కూర్చుంటే సరిపోదు. మీ మనస్సు హృదయంలో స్థిరంగా ఉండాలి, మీ నాలుక కూడా హృదయంలో ఉండాలి, అప్పుడు సైలెన్స్ ప్రారంభమవుతుంది. ఆ సైలెన్స్‌లో నీకు సంకల్పాలు ఏమీ ఉండవు. అంటే నిస్సంకల్పస్థితిలో మీరు ఉన్నప్పడే ఆ మౌనం ఇతరులకు బోధిస్తుంది అంతేగాని బలవంతాన నోరుమూసుకుని కూర్చుంటే అది ట్రూసైలెన్స్‌కు సహకరించవచ్చు కాని అది మెస్సేజ్ ఇవ్వదు. నోరుమూసుకుని కూర్చోవటం మౌనం కాదు. మామూలుగా వాక్కు మౌనం కూడా ట్రూసైలెన్స్‌కి దారి తీస్తుంది. భగవాన్ మౌనం గురించి ఏమన్నారు అంటే అవసరమైనప్పుడు మాట్లాడు, అవసరం లేనప్పుడు మాట్లాడవద్దు. అదికూడా మౌనమే. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటంకాదు, మీ అహంకారాన్ని ఫీడ్ చేయటానికి ఏమీ మాట్లాడవద్దు అని చెప్పారు. దేహాభిమానం పెరిగే మాటలు వద్దు. అటువంటి మాటలు తగ్గించుకొని ఏదైనా అవసరం ఉన్నప్పడు మాట్లాడండి. నీకు బ్రాహ్మీస్థితి కలిగిన తరువాత మాత్రమే ఎబ్‌సెల్యూట్ సైలెన్స్ వస్తుంది, అది మెస్సేజ్ ఇస్తుంది. లోపల ఉన్న ప్యూరిటీ వలన, లోపల ఉన్న సైలెన్స్ వలన అక్కడ మాటకు శక్తి వస్తుంది, అది చైతన్యం తాలూక శక్తి.

మనం వాసనల నుండి విడుదల అవ్వటం చాలా ముఖ్యం. శరీరంలో రోగం ఎక్కడ ఉంది అని తెలుసుకోవటానికి శరీరాన్ని స్కేనింగ్ చేస్తున్నట్లుగా, ప్రతీవాడు వాడి మనస్సును స్కేనింగ్ చేసి అందులో ఉన్న వాసనలు ఏమిటి, అందులో ఉన్న సంస్కారాలు ఏమిటి అని ఏ మనిషికి ఆ మనిషి జాగ్రత్తగా చూసుకోవాలి. డాక్టరు మీకు ఫలానా రోగం ఉందని చెప్పి పంపిస్తే చాలదు, ఆ రోగాన్ని తగ్గించాలి. అలాగే గురువు నీకు ఫలానా వాసన ఉందని చెప్పి పంపేయటంకాదు, ఆ వాసనను బలహీనం చెయ్యాలి. దానికి స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం ఈ మూడు కలిసిరావాలి. వాసన నశించాలి అంటే గురువు అనుగ్రహం